అక్క చెల్లెళ్లు

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

శ్యామల బడినించి వచ్చేటప్పటికి సుందరి వంట పనిలో నిమగ్నురాలై ఉంది. మల్లెపువ్వు వంటి చీర కట్టుకుని, నిగనిగా మెరిసే శరీరచ్ఛాయతో బంగారపు బొమ్మల్లే తన చెల్లెలు వంటచేస్తూండటం కళ్ల పడగానే శ్యామల మనస్సు ఒక్కసారిగా పొంగిపోయింది. ఆ క్షణంలో ఆమె సుందరిని ఇంచుమించు మగవాడు ప్రేమించినట్టు ప్రేమించ గలిగింది—మగవాడి ప్రేమలో ఉండే ఉద్రేకం మినహాగా.

క్షణికంగా కలిగే ఇటువంటి మనోవికారాలకు కారణం ఎవరు చెప్పగలరు? అటువంటి జిజ్ఞాస చేసే పని మనస్తత్వ వేత్తలది. శ్యామల గడిచిన ఏడెనిమిది సంవత్సరాల కాలంలోనూ మగవాణ్ణి ఎంత పరిపూర్ణంగా అనుభవంలోకి తెచ్చుకున్న దంటే, ఆమె కిప్పుడు సగం మగవాడి మనస్తత్వమే ఏర్పడి ఉన్నా ఉండవచ్చును. స్త్రీలో మగవాణ్ణి ఆకర్షించే దేమిటో ఆమెకు బహు సూక్ష్మంగా తెలుసును.

ఆమె తనలో తాను నవ్వుకుని, 'నా సుందరిని ఈ చూడటమే మగవాడు చూస్తే ఎంత ఉద్రేకానికి లోనై ఉండును!'' అనుకున్నది. ఒకప్పు డామెకు తన స్త్రీత్వం తన కర్థమయ్యేది కాదు. పురుష సంపర్కం కలిగే వరకూ ఆమెకు సెక్సు (sex) సంబంధించిన స్వస్వరూప జ్ఞానం ఏమీ ఉండేది కాదు. కాని అనుభవం ఆమె కాజ్ఞానం ప్రసాదించింది. నైతిక దృష్టిలో ఆ అనుభవం శోచనీయ మైనదే కావచ్చును. కళాదృష్టిలో చూడగలిగితే ఆ అనుభవంలో వేలుపెట్టి చూపదగిన లోపం లేదు. అది అంత అందమైనది, అంత పరిపూర్ణ మైనది, లక్షమంది స్త్రీలలో ఒకతెకుకూడా లభ్యం కానిది. ఆ ఒక్కతెనూ ఆ అనుభవం తలుచుకుని సిగ్గుపడ మంటే పడదు; అది చూసి గర్వించకుండా ఉండలేదు.

శ్యామల తన అవినీతి కరమైన అనుభవానికి అపరిమితంగా గర్వపడ్డది. కళాభిజ్ఞుడైన నటుడు తన కళాప్రదర్శనం ప్రేక్షకుల హృదయాలలో కలి

గించే చైతన్యాన్ని సరిగా చూచగలిగినట్టు, శ్యామల తన స్త్రీత్వప్రదర్శనం పురుష హృదయాలలో సరిగా ఎటువంటి చైతన్యం కలిగించేదీ చూచనేర్చింది. అదే స్వస్వరూపజ్ఞానం.

ఆ జ్ఞానం ఇతర స్త్రీలను అంచనా కట్టటానికి కూడా ఉపయోగపడి తీరుతుంది. సుందరి జన్మతహా తనకన్న చాలా అదృష్టవంతురాలు. భగవంతుడామెకు తనకన్న అధికమైన సౌందర్యమే కాక, అంతకంటె కూడా ముఖ్యమైనది అధికమైన ఆకర్షణశక్తి ప్రసాదించాడు. తాను ప్రయత్నపూర్వకంగా చెయ్యవలసినది తన చెల్లెలికి సహజంగా అబ్బుతుంది. పురుషుడికి సుఖం ఇవ్వటమనే మనోహరమైన అనుభవం తన కంటె కూడా మరింత పరిపూర్ణంగా పొందగలదు సుందరి—ప్రయత్నిస్తే! కాని సుందరి ప్రయత్నించదు: ఆమె మనస్సు అటు వెళ్ళనే వెళ్ళదు. అందుకు శ్యామల చాలా నొచ్చుకున్నది.

నేను శ్యామలను సమర్థించి నలుగురినోటా నానబోవటంలేదు. ఆమెను సమర్థించటం నాపని కాదు, ఆమె వ్యక్తిత్వాన్ని విపులీకరించటమే. నైతికంగా ఆమెకూ ఒక తాగుబోతుకూ తేడాలేదు. తాగుడులో కేవలమూ నిషా మాత్రమే కాక ఆనందంకూడా ఉందని ఎవరైనా ఒకరు తెలుసుకోవటం కద్దు. అటువంటివాళ్ళు తామెరిగిన వాళ్ళను రెండు జాతులుగా చేసి చూస్తూఉంటారు—తాగటానికి అర్హతలేనివాళ్ళూ, తప్పక తాగవలసిన వాళ్ళూ' తప్పక తాగవలసిన జాతిమనిషికి తాగుడు ధ్యాసే లేక, అదిఅంటేనే గిట్టకపోతే వాళ్ళ మనస్సు నొచ్చుకుంటుంది. శ్యామల కూడా అంతే. ఒకవిధంగా ఆమె అపూర్వమైన అదృష్టవంతురాలు. లోకం అంతగా అసహ్యించుకునే జారత్వంలో ఆమెకు పశ్చాత్తాపం కలిగించే అనుభవం ఏమాత్రమూ కలగలేదు. ఆమెకు స్త్రీ పురుష సంబంధం అతి పవిత్రమైనదిగానూ, అందులోఉన్న ఆనందం అత్యుత్తమమైనదిగానూ తోచటంలో వింతలేదు. చిన్నతనంలో పెద్దలవల్ల నేర్చుకున్న నీతి పాఠాలామెకు సహజంగా అర్థం లేనివై పోయినై. మనం పుస్తకాలలో చదివిన విషయాలనూ ఇతరులవల్ల తెలుసుకున్న విషయాలనూ పురస్కరించుకొని కలిగే విశ్వాసాలు అనుభవంవల్ల ఆ మాత్రం సంస్కారం పొందకపోయినట్టయితే అనుభవం యొక్క ప్రయోజన మేమిటో నాకు తెలియదు.

శ్యామలను గురించి ఒక్కముక్క అనటానికి మాత్రం నాకు సాహసం లేకపోలేదు: అవినీతి ద్వారా ఆమె సంపాదించిన ఈ మధురమైన అనుభవం ఆమెకు భర్తవల్ల కలిగిఉంటే శ్యామల సీతా సావిత్రీ మొదలైన పూర్వ స్త్రీల శ్రేణిలో చేరి ఉండును.

చిత్రమేమిటంటే అటువంటి ఆనందం ఆమెకు ఆదిలో ఇచ్చినవాడు ఆమె భర్తే. కాని, పాపం, అతను దక్కలేదు; శ్యామల కాపరానికి వెళ్లిన రెండవ సంవత్సరములోనే కలరా తగిలి పోయినాడు. తరవాత నాలుగు సంవత్సరాలపాటు ఆమె పరపురుషుణ్ణి ఎరగదు. ఈలోపుగా ఆమె మెల్లగా కొంత ఇంగ్లీషు చదివి, ఒక చిన్న పరీక్ష ప్యాసయి, ట్రెయినింగు చదివి పంతులమ్మ ఉద్యోగం సంపాదించింది. అప్పటినించీ ఆమె జీవితంలోకి పర పురుషులు ప్రవేశించారు. అదైనా నియమితంగా ఎవరో ఒకరే కాక పోవ టానికి దేశంలో ఉన్న నీతి విశ్వాసాలే కారణం. కాని ఆమె ప్రణయాలలో ఎప్పుడూ కల్మషం గాని, కపటం గాని, కృత్రిమమైన నటన కాని లేదు. ఆమె జీవితంలో జోక్యం చేసుకున్న పురుషులు కూడా అదృష్టవశాత్తూ ఆమెను ఆవిధంగా ప్రేమించినవాళ్లే.

"నేను అపరూపపు అందగత్తెను కాకపోవటంవల్ల సన్నెవ్వరూ ప్రేమించ కుండా వాంఛించరేమో!" అనుకునేది శ్యామల. ఆమె తన ప్రియుల నెవరినీ మరవలేదు—తన భర్తను కూడా...

సుందరి శ్యామల దగ్గరకి వచ్చినాలుగు రోజులే అయింది. ఈ నాలుగు రోజులనించీ శ్యామల ఒక కొత్తరకం ఆనందం అనుభవిస్తున్నది. ఆటువం టిది శ్యామలకు ఇతరులవల్ల కలగనేలేదు సరేకదా, తన చెల్లెలివల్లకూడా ఎన్నడూ కలిగిఉండలేదు.

అంతదాకా దేనికి, ఈ సుందరికి తనకూ ఒకప్పుడు ఎంతమాత్రము పడేది కాదు. ఎప్పుడూ కీచులాడుకొనేవాళ్లు. "మీరు అక్కచెల్లెళ్లు కాదర్రా! సవతులే, తల్లీ!" అని వాళ్లమ్మ తెగ విసుక్కనేది. అయిదారేళ్లయిన తరువాత కనపడి సుందరి శ్యామలలో ఉన్న మాతృత్వాన్నంతా పైకి తెచ్చింది.

నిజానికి పరిస్థితులు అట్లా ఒనగూడినై. ఈ అయిదారు సంవత్సరాల కాలంలో, పాపం, సుందరి ఎన్నివిధాల కష్టాల పాలయింది! ఆమె కాపరానికి వెళ్ళి అయిదు సంవత్సరాలు దాటింది. శ్యామల తన చెల్లెల్ని కిందటి సారి అదేచూడటం. కాపరానికి పోయినప్పటినించి సుందరి సౌఖ్యంఎరగదు. ఆమె భర్తకూ అతని తండ్రికీ ఒకక్షణం పడేదికాదు. ఒక తండ్రేమిటి? సుందరి భర్తకు ఇంటిల్లిపాదీ విరోధులే. అతని మీది కోపం సహజంగా సుందరి మీదకూడా తిరిగింది. ఆమెను అత్తవారు దాసీకన్న కనాకష్టంగా చూసేవారు.

ఇక సుందరి భర్తవల్ల ఏ మాత్రమైనా సుఖంపొందితే ఆమె అప్పటి జీవితానికదేసుఖం. అదయినా దక్కిందా? ఆమెభర్త నాలుగు సంవత్సరాల క్రితం ఇంటోవాళ్ళందరితోను హోరాహోరి పోట్లాడి ఒకరాత్రివేళ చేతికందిన నగలూ డబ్బూ తీసుకొని వెళ్ళిపోయినాడు. మళ్లీ అతని జాడ తెలియదు. అతను లేచిపోయినా నెలరోజులకే సుందరి అత్తవారిల్లు భరించలేక పుట్టింటికి వచ్చేసింది. పుట్టింటి దగ్గిరకూడా సుందరికి విరామం దొరకలేదు. ఆమె అన్నలు ఆమెచేత రిజష్టరు నోటీసు లిప్పిస్తామనీ మనోవర్తిదావాలు వేయిస్తామనీ కూర్చున్నారు. వారిడబ్బు కక్కుర్తి సుందరికి అసహ్యం వేసింది. కాని ఎట్లాగో ఒక సంవత్సరంపాటు పుట్టిల్లు భరించి ఆ తరువాత మళ్లీ ఆమె అత్తింటికి వెళ్ళింది, ఏకష్టాలయినా అక్కడే పడదామని. జరిగిన మూడుసంవత్సరాలూ సుందరి అత్తవారింటనే గడపింది. ఎట్లాగడపిందో ఆమెకే తెలియాలి.

ఆఖరుకు సుందరి తన అక్కకు ఉత్తరం రాసింది, తన అగచాట్లన్నీ చెప్పుకుని. శ్యామల నాలుగురోజుల క్రితం ఆమెను తనదగ్గిర తెచ్చిపెట్టుకుంది. సుందరి పాట్లను గురించి ఆమెకు దాదాపు ఏమీ తెలియదు. తను తెచ్చుకుంటున్న ఈ పాతికరూపాయలూ తనకున్న ఈ కాస్తస్వేచ్ఛా తనకు అయినవాళ్లు హరించగలరని తెలిసి శ్యామల అజ్ఞాతవాసం చేస్తున్నది, అందరితోనూ సంబంధాలు తెంచుకుని. సుందరి ఉత్తరం ఆమె రాయి చేసుకున్న మనస్సును ద్రవింప చేసింది......

ఈ నాలుగు రోజులనించీ శ్యామల సుందరిని జాగ్రత్తగా గమనిస్తున్నది. సుందరి తత్వం ఆమెకు బోధపడలేదు. ఆమె భర్తకోసం దిగులుపడు

తున్నదా? సుందరికి మగజాతిని చూస్తే పరమ అసహ్యమని ఒకటి తెలుసుకో గలిగింది శ్యామల. ఆ అసహ్యతకు పునాది ఏమిటో తెలియలేదు. ఒక వేళ ఆమె మొగుడివల్ల అనుభవించిన సౌఖ్యం విస్మరించుకుంటూ వైరాగ్యసారణిలో పడిపోయిందా? లేక భర్త తనను విడిచి పెట్టి పోయినందున మగజాతిమీద ఆమెకు పగగా ఉందా?

సుందరిని అర్థం చేసుకోవటం వల్ల శ్యామలకు ప్రత్యేక ప్రయోజనం ఉంది: సుందరి ఎదుట తను ఎట్లా ప్రవర్తించవలసిందీ తేలాలి. ఏ కారణం వల్ల కాని తనమూలకంగా సుందరి బాధపడటం కాని ఆమెకు జుగుప్స కలగటం కాని శ్యామలకు ఏమాత్రము ఇష్టంలేదు.

అయితే సుందరి సుఖపడేమార్గం ఏదయినా ఉంటే దానికి తను అడ్డం ఉండటం ఏ మాత్రమూ ఇష్టంలేక పోగా తగిన ప్రోత్సాహం ఇవ్వాలని కూడా ఉంది శ్యామలకు. ప్రస్తుతం శ్యామల సమస్య ఏమంటే సుందరి మనస్సు ఏమాత్రమూ నొప్పించకుండా ఆమె మానసికస్థితి తెలుసుకోవటం అది సాధించేమార్గం శ్యామలకు ఏమాత్రమూ కనిపించలేదు.

"ఏమే, అక్కా? వంటయింది. భోంచేస్తావా?" అన్నది సుందరి. ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు. సుందరి మామూలుకన్న పరధ్యానంగా ఉన్నట్లు శ్యామల అనుమానించింది, కాని ఏమీ అనలేదు.

అకస్మాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చినదాని మోస్తరుగా సుందరి "అన్నట్టు నీకోసం ఎనిమిదిన్నర గంటలప్పుడెవరో వచ్చారే! సుబ్బారావో ఎవరోట! తెలుసునా?" అన్నది.

"ఏ సుబ్బారావో! అంత ఎక్కువ తెలిసినవాడై ఉండడు. ఎనిమిదిన్నర గంటలప్పుడు నేను బడిలో ఉంటానని సామాన్యంగా నన్నెరిగినవారందరూ ఎరుగుదురు. ఏంపనిట"

"ఏమో, నాకేమీ చెప్పలేదు."

సుందరిని చూసి శ్యామల ఆశ్చర్యపడ్డది. తనకు ఆ వచ్చినవాణ్ణి గురించి ఆలోచించటానికి ఏమాత్రమూ ఇష్టంలేనట్టు సూచించటానికి ఆమె అంత ప్రయత్నం చెయ్యటందేనికి? "సుబ్బారావో, ఎవరో." సుందరి ఆ పేరు

తనకు జ్ఞాపకం సరిగా లేనట్టు నటించటం అంతా తప్పుగా ఉంది శ్యామలకు. అక్కడితో ఆ విషయం అయిపోయింది.

సాయంకాలం రెండు ముప్పావుకు శ్యామల మళ్లీ బడికి వెళ్ళి పోయింది. మూడింటికి ఆ సుబ్బారావు మళ్ళావచ్చాడు పంతులమ్మగారున్నారా అంటూ.

సుందరి గుమ్మంలో నిలబడి అతనికేసీ ముఖంచిట్లించి చూస్తూ లే రన్నది. ఆ సుబ్బారావు వచ్చిన పని అయిపోయింది. కాని అతను వెళ్ళడు. సుందరి ఆ గుమ్మందగ్గిర్నించి కదలదు. అతనికేసి చూడడం మానదు. చూసేది ఏమాత్రమూ ఇష్టం ఉన్న దానల్లే చూడదు. పరమ అసహ్యంగా మొహం చిట్లించుకుంటుంది. అతన్ని పంపదు. అతను అక్కడ ఇంకా ఎందుకున్నాడు అర్థంచేసుకున్నట్టా, చేసుకోనట్టా? అతని ప్రవర్తన ఆమెకు నచ్చినట్టా, నచ్చనట్టా?

శ్యామల నీతికలది కావచ్చును. కాని ఆ క్షణంలో ఆమె చెల్లెల్ని చూస్తే చాలా అసహ్యముగాని ఉండేది.

ఈ లోపల సుబ్బారావుగుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నై. కాని అతని మనస్సుమాత్రం భీమబలంతో అతన్ని ఆమెవైపు లాగుచున్నది. ఇద్దరు మహాబలశాలులు అర్భకుణ్ణి చెరొకవైపూ లాగుతుంటే వాడు ఎటూ కదలకపోయినప్పటికీ యమబాధ పడ్డట్టు, సుబ్బారావు తలవాకిలి లోపలిగా నిలబడి బయటికిపోలేడు, లోపలికి సాహసించి రాలేడు; అక్కడే ఉండి అనివార్యంగా బాధ పడుతున్నాడు.

సుందరి ఎటో ఒకవైపు వాణ్ణి లాగో నెట్టో వాడిబాధ నివారణచెయ్యదు. తలుపు దఢాలున వేసుకుని తాను వెళ్ళిపోయినా లేక వాడిబాధకు జాలి పడి నవ్వుతూ పలకరించినా, మరొక ఆశగొల్పినా వాడికి మోక్షం ఉండును. ఆమె ఏదీ చెయ్యదు.

సుబ్బారావు చివరకు సాహసించి తలవాకిలి తలుపుదగ్గిరగా చేరదీసి ఆమెను సమీపించాడు, తాను ఏమీ గమనించనిదానల్లే సుందరి ఇంకా మొహం చిట్లిస్తూనే లోపలికివెళ్ళిపోయింది. సుబ్బారావు ఫాక్టరీమాదిరిగా కొట్టుకు లాడుతున్న హృదయంతో ఆమెను సమీపించి ఆమెఎదట నిలబడ్డాడు.

సుందరి వాడివంక మరింత తీవ్రంగాచూసి మరొకపక్క గదిలోకి వెళ్ళి పోయింది.

సుబ్బారావు కళాశూన్యమైనసుందరి ప్రవర్తన ఇక భరించలేకపోయినాడు. అతను వెంబడించి ఆమెను పట్టుకున్నాడు.

సుందరి పులిమాదిరిగా అతనివైపు తిరిగి "ఏమిటీ పని? నీకు బుద్ధిలేదూ?" అన్నది.

సుబ్బారావుకు మొహాన గట్టిగా చరిచినట్టయింది. అతను పెద్ద అన్యాయం జరిగినవాడల్లే "ఆమాట ఇప్పుడా అడుగుతావు?" అన్నాడు. ఆమాట శ్యామల వినగలిగితే ఆమెగుండె ద్రవించిఉండేది.

"నేను పొద్దున నీ కెదురుగా పావుగంటసేపు నుంచుంటే అప్పుడు తెలుసుకోలేకపోయినావా, నాకు బుద్ధిలేదని?" అన్నాడు సుబ్బారావు ఇంకా ఆగ్రహంతోనే. "ఈపూట నేను నీకళ్ళఎదట తలుపువేసి నీ వెంట లోపలికి వస్తుంటే అప్పుడే అడక్కపోయినావా? నాకు బుద్ధిలేదు. మరి నీకళ్లేమయినై, నీ స్త్రీ హృదయం ఏమయింది? నేను నీకోసం చచ్చిపోతున్నానని నీకు తెలియకపోయిందా? మీ వాకిలిముందుగా నాలుగు రోజులనుంచీ రోజుకు వందసార్లు ప్రదక్షిణం చేస్తున్నాను. అందులో కనీసం పదిసార్లయినా నీకంట పడుతున్నాను. నా ఉద్దేశం అకస్మాత్తుగా ఇప్పుడే తెలిసినట్టు నటిస్తావా!"

"ఇది చాలా బాగాఉంది. నా కిటువంటి పను లసహ్యం. నన్ను వదలిపెట్టు!"

"నేను వదలను, నాకు నిజంగానే బుద్ధిలేదు. ఉంటే ఈ కాసేపటిలో నీమీద అసహ్యం కలిగి ఉండవచ్చును. నాకింకా నీమీద భ్రమ పోవటం లేదు. అందుకని ఇంకొక బుద్ధిలేనిపనికూడా చెయ్యబోతున్నాను. నీకు డబ్బిస్తాను. రేపు పాతికరూపాయలు తెచ్చియిస్తాను నువు ఒప్పుకుంటే!"

సుందరి ఒప్పుకుంది, కాని ఆ ఒప్పుకోవటంలో నాజూకేమీలేదు. ఆమెకు అతనిస్పర్శ పరమఅసహ్యం అయినట్టూ, అతను తనను అబలనుచేసి బలాత్కరిస్తున్నట్టూ ప్రవర్తించింది. ఆమె నోటివెంట "ఏబ్బే! ఛీ! ఛూ! పాడూ!" అనేమాటలు తప్ప మరొకటి రాలేదు.

సుందరి కిది మొదటి అనుభవంకాదని భావించవలిసిఉంది, సుబ్బారావుకూ కాదు. కాని అతను సుందరిని చూసినప్పుడు ఆమె దేవత అనీ తాను పూర్వం ఎరగనిజాతి అనీ అనుకున్నాడు. ఒక పాతికరూపాయలు వదిలించుకుని సుందరితో నాలుగురోజుల పరిచయం సంపాదించేటప్పటికి అతని పాపం పండి మనస్సు విముఖత్వం చెందింది.

అతను చిన్నవాడు, ఆదర్శాలుండీన్నీ వాటికి ఆచరణరూపం ఇవ్వలేని దౌర్భాగ్య జీవులలో ఒకడు. అతను సుందరి అనుభవం కలిగిలకంటగానే జరిగినదంతా విపులంగా ఒక ఉత్తరం రాసి శ్యామలపేర పోస్టుచేసి తన సుఖస్వప్నాలమీద పేడనీళ్ళు చల్లినందుకు సుందరిమీద పగతీర్చుకున్నాడు.

ఆ ఉత్తరం శ్యామల హృదయానికి గొడ్డలిపెట్టయింది. సుబ్బారావు వ్యక్తీకరించిన లక్షణాలన్నీ సుందరిలో ఉండటానికి అవకాశం ఉందని శ్యామల ఇప్పుడు సులభంగానే అర్థం చేసుకోగలిగింది.

తన దగ్గిరికి వచ్చిన కొత్తలో సుందరి తనకు అర్థంకాకుండా ఉండికూడా తనకు సన్నిహితురాలనిపించింది. తీరా ఆమె అర్థం అయేటప్పటికి తమ ఇద్దరిమధ్యా ఈ అగాధం ఎందుకుండవలసివచ్చింది!

ఇప్పటికీ శ్యామలకు సుందరిమీద అసహ్యంగాని కోపంకాని కలగలేదు, దిగులుమాత్రమే. తనరక్తం, తన ప్రతిబింబం—సుందరి తన కెందు కర్థం కాదు? తనకింత భేదించిందేం?

ఎవరుచెబుతారు? తనంతట తాను తెలుసుకోలేకపోయింది శ్యామల....

ఒకనాటిరాత్రి పదిగంటలు దాటినతరువాత వీధితలుపెవరో తట్టారు. శ్యామలకు అప్పుడే నిద్ర పట్టిందో లేక పట్టుతూ పట్టుతూఉందో—అంతే. తలుపుచప్పుడుకు ఆమెనిద్రమత్తు యావత్తూ వదిలిపోయింది. అంతకు పూర్వమే నిద్రపట్టినసుందరి గాఢనిద్రలోఉంది. శ్యామల చప్పుడుకాకుండా పక్కమీదినించి లేచి ఇవతలికి వచ్చేసింది. వచ్చినవాడు తన స్నేహితులెవరైనా అయిఉంటారని ఆమె సందేహం. సుందరి వచ్చినప్పటినించీ శ్యామల తనస్నేహితులను ఇంటికి రానివ్వటంలేదు.

శ్యామల తలుపుతీసి నివ్వెరపోయింది. తలుపు తట్టినమనిషి ఎవరో బిచ్చగాడిమాదిరిగా ఉన్నాడు. ఆ వెన్నెట్లో అతని ఆకారం దాదాపు భయం

కొలిపేటట్లుంది. అతని మొహాన వెలుతురుపడటంలేదు, కాని మాసిన గడ్డమూ లోతుకుపోయిన కళ్ళూ స్ఫురించుచున్నై. శరీరంమీది గుడ్డలు చాలామాసి అక్కడక్కడా చినిగిఉన్నై. అతనినించి చెమటా మట్టీ కలిసిన వాసనకూడా సూక్ష్మంగా వస్తున్నది.

“ఎవరు నువ్వు?” అన్నది శ్యామల కఠినంగా.

అతను అర్థంకాకుండా చెయ్యిఊపాడు. అతను పెదవులు కూడా ఏదో గొణిగినై. ఆమనిషి అసహాయ స్థితిని చూసి శ్యామల జాలిపడి మృదువుగా “ఎవరు—ఏంకావాలి నీకు?” అన్నది.

కాసిని మంచినీళ్ళిప్పించండి,” అన్నా డతను హీనస్వరంతో.

అతని మాటకు శ్యామల ఆశ్చర్యపడ్డది. అతని మాటలధోరణి నాగరికతనూ బ్రాహ్మణత్వాన్ని సూచిస్తున్నది.

“లోపలికి రండి!” అన్నది శ్యామల అప్రయత్నంగా.

అతను లోపలికి వచ్చి వరండాలో ఆగాడు. శ్యామల మరచెంబుతో మంచి నీళ్లు తెచ్చి ఇచ్చింది. ఆ మనిషి ఒక్క గుక్కలో చెంబులో సగం పైగా తాగేసి మిగతావి ఆదుర్దాలో ఒంటినిండా పోసుకున్నాడు.

“నేను అన్నంతిని చాలారోజు లయింది” అన్నాడతను కొంచెం జీవం వచ్చిన గొంతుతో.

“పాపం! అన్నం పెడతాను లోపలికిరా!” అన్నది శ్యామల.

“వద్దు. ఇప్పు డన్నంతింటే చచ్చిపోతాను. ఆ మంచినీళ్ళుబాగున్నై, ఇంకాసిని తాగుతాను.”

శ్యామల చెంబుతో మళ్ళీ నీళ్ళు తెచ్చింది కాని అతను ఎక్కువ తాగలేక పోయినాడు.

“మీ రెవరు?” అన్నది శ్యామల.

“నేను—నా పేరు వెంకట్రావు;” మీరు—

“వెంకట్రావా! ఏ వెంకట్రావు?”

“మీ పేరు శ్యామల కాదూ?”

“అవును!” అన్నది శ్యామల ఆశ్చర్యంతో.

"సుందరి—నాభార్య—ఇక్కడ ఉందని తెలిసింది. చూసిపోదామని—" అతని నోరు కట్టుపడినట్టయింది. శ్యామల నోటివెంట అంతకుముందే మాట లేదు.

"వెంకట్రావు! సుందరి మొగుడు! ఇన్నాళ్ళూ ఎక్కడున్నావు?"

అతను మాట్లాడ లేదు.

"పిచ్చివాడా, ఎందుకిట్లా పారిపోయినావు? అయ్యో, ఈ కర్మమేమిటి? ఈ అవతారమేమిటి? ఇంతకాలం పట్టిందా నీకు పశ్చాత్తాప పడటానికి?" ఆ వార్ధాక్యుడిలో వెనకటి ఆవేశం ఇంకాచావలేదు.

"నేనేమీ పశ్చాత్తాపపడలేదు." అన్నాడతను. తాత్కాలికంగా ఆ హీన స్వరం బలిష్ఠమయింది. కాని మరుక్షణం ఆ ఉత్సాహంచల్లారి పోయింది. కళ్ళల్లోనికి వచ్చిన కాంతి తరిగిపోయింది. గొంతుమళ్ళా హీనస్వరంపడ్డది. అతను మొహానికి చేతులు అడ్డంపెట్టుకొని రెండు మూడుసార్లు గట్టిగా ఊపిరిపీల్చి "ఒక్కందుకే పశ్చాత్తాపం. నేను సుందరికి అన్యాయంచేశాను. అదే నన్ను దహించేస్తున్నది. మేము ఎన్నడూ సుఖపడలేదు. ఒకప్పుడు చేతులోఉన్న సుఖాన్ని తృణీకరించాను. ఎందుకో చెప్పలేను. అప్పుడు నా కది ఎక్కువగా కనుపించలేదు. నా ఆశలు ఒకటీ ఫలించలేదు. ఆశల్నంతా సుందరికీ నాకూ మధ్య అడ్డంపెట్టాను. పాపం సుందరి ఏపాపం ఎరగదు. దాన్నిమనస్ఫూర్తిగా ఒక్కసారి కూడా సుఖపెట్టలేదు. నన్నూ దాన్ని కూడా అన్యాయం చేసుకున్నాను. భ్రష్టుణ్ణి."

శ్యామలకు ఒక్కసారిగా జ్ఞాన ప్రకాశం అయింది, సుందరి తత్వం యావత్తూ ఆమెకు అర్థమయి నట్టయింది.

"అయితే ఇప్పుడు మళ్లీ సుందరికోసం వచ్చావా?" అన్న దామె.

"అవును. చూసిపోదామని—మాట్లాడు దామని—"

"ఇట్లా కాదు. ఈస్వరూపంతో నువ్వు సుందరికి కనిపించవద్దు. ఈ రాత్రి ఇక్కడే పడుకో ఈ సావడిలో పక్కవేస్తాను. నేను డబ్బిస్తాను. రేపు మంచి గుడ్డలు కొనుక్కో, ఆ జుట్టు కత్తిరించుకో. సాధ్యమైనంతవరకు నీ వెనకటి అవతారంలో రా, రేపు రాత్రికి. సరా?"

వెంకట్రావు శ్యామల ఇచ్చిన డబ్బు తీసుకుని ఆ రాత్రి అక్కడే పడుకుని తెల్లవారుజామునే వెళ్లిపోయినాడు. మర్నాడు రాత్రి శ్యామల అతని కోసం మేలుకుని కూర్చున్నది. అతను రాగానే తలుపుతీసి అతన్ని లోపలికి పంపి తను వరండాలో కుర్చీలో పడుకుని అస్పష్టమైన ఆలోచనలో పడ్డది. అయిదు నిమిషాలలో అతను బయటికి వచ్చాడు, తలవంచుకుని బయటికి వెళ్లిపోతున్నాడు. శ్యామల చివాలున కుర్చీలో నించి లేచి అతన్ని వెంబడించి కలుసుకుని "ఏం?" అన్నది.

"నన్ను సుందరి గుర్తించ లేదు," అన్నాడు.

"నిన్ను గుర్తించి ఉండాలి. గుర్తించక పోవటం అసంభవం."

"నాకు తెలుసును. దానికి నే నక్కర్లేదు. నేను చేసిన ద్రోహాన్ని అది క్షమించ లేదు."

శ్యామల ఆవేశంతో "ద్రోహం! క్షమ! ......మూర్ఖుడా, దాని కెంత అపకారం చేశావో నీ కిప్పటికైనా అర్థమయిందా? దాని జన్మకు సంసార సుఖ మంటే ఏమిటో అర్థం కాకుండా చేశావు! తెలిసిందా? ఈ జన్మకు దాన్ని ఎవరూ ప్రేమించరు, అది ఎవరినీ ప్రేమించలేదు. నీ కర్థమవుతున్నదా? ఇక ప్రకృతి కూడా దాన్ని ప్రేరేపించ లేదు. దానిలో ఉన్న ప్రకృతిని కనపడకుండా కాస్తకాస్తే గిల్లేశావు. నీ కర్థమవుతున్నదా? నువ్వు చేసిన పాపానికి అది ఫలితం అనుభవిస్తున్నది. అనుభవిస్తున్న సంగతి కూడా దానికి తెలియదు.

"దాని యౌవనాన్ని అపహరించినవాడివి, సంసారం చెయ్యడంలో నిజమైన సుఖం ఉందని దాని కెందుకు తెలియ నివ్వలేదూ? కామం అసహ్యకరమైనది కాదనీ, మోక్షాని కది మొదటి మెట్టనీ ఎందుకు చూపలేక పోయినావు?

"నువ్వేమీ పశ్చాత్తాపపడి రాలేదు. నీ కిక ప్రపంచంలో ఇంకేమీ లేదు స్వంతం చేసుకోవటానికి — నా చెల్లెలు తప్ప. ఆ హక్కు ఒకటి దుర్వినియోగపరచటానికి వచ్చి, ఎత్తు పారదని తెలియగానే చల్లగా జారుకుంటున్నావు.

"నీకు నిజంగా బుద్ధి వచ్చినట్టయితే దాన్ని వదలి పెట్టకు. వెనక నిర్వర్తించటానికి అశ్రద్ధచేసిన బాధ్యతను ఇప్పుడు నిర్వర్తించు. మగవాడిలోనూ సంసారసుఖంలోను దానికి విశ్వాసం పుట్టించు. అందుకుగాను ఏ త్యాగమైనా చెయ్యి. దాని కాళ్ల ముందర ప్రాణాలు విడువు అవసరమైతే. ఒకసారి దానిహృదయం మారితే దానివల్ల నువ్వు కాకపోతేమరొకరైనా బాగుపడతారు. తెలిసిందా? అదయినా బాగుపడుతుంది. అటువంటి త్యాగం ఇతరులను చెయ్యమంటే చెయ్యరు. వారికేం పట్టింది? అది ఇట్లా కావటానికి వాళ్లు బాధ్యులు కారు. నువ్వే బాధ్యుడివి. నువ్వే ద్రోహివి!" అన్నది.

వెంకట్రావు భయపడ్డ వాడల్లే వెనక్కు వెనక్కు పోతూ "నాకేమీ తెలియదు. నే నేమీ చెయ్యలేను. అన్నీ విసర్జించాను. నాకేమిటి?" అంటూ వాకిలి సమీపించి బయటికి జారుకున్నాడు.

శ్యామల నిట్టూర్పు విడిచింది. ఆమె అట్లాగే కొంతసేపు నిలబడి ఇంకొక నిట్టూర్పు విడిచి లోపలికి వెళ్లింది.

సుందరి తన మంచం పక్కన చతికిలబడి మొహం దిండుకుపెట్టి వెక్కి వెక్కి ఏడుస్తున్నది. శ్యామల ఆమెను చూడగానే ఆదుర్దాగా దగ్గిరికి వెళ్లి చెల్లెల్ని పొదువుకుని, "ఎందుకే, అమ్మా? పోతే పోయినాడులే, దిగులు పడకమ్మా, ఏడవకు!" అని సముదాయించింది.

"అదికాదు. నీ సంగతులు కొన్నికొన్ని నే నదివరకే విని, నువు సిగ్గుమాలిన దాని వనీ, నువ్వుచేసిన పనే నేను ఎప్పుడైనా చేసినా నాకు అసహ్యం కనక నేను నీకంటె మంచిదాన్ననీ అనుకునేదాన్ని!" అన్నది సుందరి దుఃఖం ఉపశమించుకోలేకుండా.

సుందరి తను వెంకట్రావుతో అన్నమాటలు విన్నదని శ్యామలకు తెలిసింది చెల్లెలికి ఏం సమాధానం చెప్పాలో ఆమెకు తెలియలేదు. కాని ఆమె హృదయం ఆ చెల్లెలి కోసం యథాప్రకారం పొంగి పొర్లసాగింది.